క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన



ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోరంట్ల: ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై సోమవారం స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త లాజరస్ మాట్లాడుతూ ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికిగాను పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీలోపు ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భజన మండలి భవన నిర్మాణానికి విరాళం



రూ.50 వేలను అందజేస్తున్న రామలింగారెడ్డి

గోరంట్ల: మండల కేంద్రంలో సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న సత్యసాయి భజన మండలి భవన నిర్మాణానికి నార్సింపల్లి గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగారెడ్డి సోమవారం 50 వేలు విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని సత్యసాయి సేవా సమితి సభ్యుడు రత్నయ్య శెట్టికి అందజేశారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



మడకశిర చెరువుపై వెలసిన అక్కమ్మ దేవతలు

మడకశిర: మడకశిర చెరువు కట్టపై వెలసిన అక్కమ్మ దేవతలకు సోమవారం సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షం కోసం ఆయకట్టు రైతులు సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్‌లో సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ వీరమారుతీసాయి ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాలపై దివ్యాంగులకు అవగాహన కల్పించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాథ్ ,బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శివన్న గత నెలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్రస్థాయి వ్యాస మహర్షి అవార్డులను అందుకున్నారు. సోమవారం కల్లుమర్రి, మణూరు కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలు విశ్వనాథ్, శివన్నలను సన్మానించారు.

సోమందేపల్లిలో భారీ వర్షం



రోడ్డుపై కూలిన చెట్టు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై చెట్టు కూలింది. గ్రామంలోకి వచ్చే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు స్తంభించాయి.

మడకశిరలో..

మడకశిరరూరల్: మండలంలో సోమవారం సాయంత్రం గంటకుపైగా జోరు వర్షం కురిసింది. ఖరీఫ్ సాగు చేసిన వేరుశనగ పంటతో పాటు ఇతర పంటలకు ఎంతో ఉపయోగపడిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ట

మడకశిరరూరల్: మండల పరిధిలోని సిద్దగిరిలో మరమ్మతులు చేసిన ఆలయంలో సోమవారం ఘనంగా మహాగణపతి, శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి నూతన శిలా విగ్రహ స్థిర ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు: మండలంలోని చాగలేరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాగేపల్లి నుంచి చాగలేరు వైపునకు బైక్‌పై వెళుతుండగా మలుపు వద్ద కారు ఢీకొనడంతో మంజుల, ఆమె కుమారుడు శశాంక్‌రెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

మోతాదు మించితే అనర్థమే !

- అతిగా వాడుతున్న రసాయన ఎరువులతో ముప్పు
- విషతుల్యమవుతున్న ఆహార పదార్థాలు
- పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు
- రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



అగళి: పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహారం అందించే క్రమంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు, కలుపు నాశనుల వాడకం పెరిగింది. ఇలాంటి ఆహారం వల్ల ప్రమాదకర రసాయనాలు మన ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

300 ఎకరాల్లో కూరగాయలు

మడకశిర నియోజకవర్గంలో పండ్ల తోటలతో పాటు పూల తోటలను కూడా రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. కీరదోస సాగు 450 హెక్టార్లలో, పూల తోటలు 600 ఎకరాల్లో సాగు, కూరగాయలు 300 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఆయా పంటలకు పది రోజులకోసారి రసానిక మందులను పిచికారీ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కూరగాయలు, పూల తోటలకు సంబంధించి చీడపురుగులు ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. ఈ నేపథ్యంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది.

చీడపీడల నివారణ కోసం..

పంటల్లో చీడపీడల నివారణ కోసం పరుగు మందులు వాడటం సర్వసాధారణం. అయితే ఇష్టానుసారంగా పంటలకు మందులు పిచికారీ చేస్తే మంచి జరగడం అటుంచితే దుష్ప్రవాలే ఎక్కువగా ఉంటాయి. కొందరు రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించకుండా మందుల దుకాణంలో ఏది పడితే అది కొనుగోలు చేసి వాడుతుంటారు. ఇలా చేయడం వల్ల భూమి సారాన్ని కోల్పోవడమే కాకుండా పంట నష్టపోయే ప్రమాదం ఉంది. సాగు వ్యయం కూడా పెరుగుతుంది. పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అవసరం మేరకు వినియోగిస్తే మంచిదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

లాభం కంటే నష్టం అధికం

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటలు సాగు చేయడంతో రసాయనిక మందుల వినియోగం క్రమంగా పెరుగుతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ పురుగుల మందు వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. లేకపోతే పంట దిగుబడి దెబ్బతినంతో పాటు రైతు నష్టాల భారిన పడాల్సి వస్తుంది. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహరక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుంది. భూసారం తగ్గిడంతో భూమి తన సహజత్వాన్ని కోల్పోతుంది. దీంతో లాభం కంటే నష్టం అధికంగా ఉంటుంది. పంటలకు నీటి తడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటలకు రసాయనాలు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలని నిపుణులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయకూడదు.
- తెగులు, పురుగుల మందు కలిపి పిచికారీ చేయరాదు.
- చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు చేతులతో రుద్దుకోకూడదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడపడితే అక్కడ వేయకూడదు.
- స్ప్రేయర్లకు లీకేజీ లేకుండా చూసుకోవాలి.
- పిచికారీ తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో మందులను పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు,చేతులకు గ్లౌజులు,కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపు మందు కొట్టిన తరువాత పురుగు మందులు వాడొద్దు. మొక్కలపై భాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– కృష్ణమీనన్, సహాయ వ్యవసాయ సంచాలకులు, మడకశిర

వైద్యుడిని సంప్రదించాలి



పంటలపై క్రిమి సంహారక మందు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. పిచికారీ సమయంలో అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. పురుగు మందు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిలోకి రసాయన మందు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.

– శివనంద , వైద్యాధికారి, అగళి

హెల్మెట్ వినియోగంపై అవగాహన

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్‌లో పోలీసులు హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

చిలమత్తూరు: మండలంలోని కుషావతి నదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. ఇసుకను తరలిస్తుండగా కోడూరు పంచాయతీకి చెందిన ట్రాక్టర్, చిలమత్తూరుకు చెందిన మరో ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేశామన్నారు. కాగా రెండు ట్రాక్టర్లు టీడీపీ కార్యకర్తలకు చెందినవి తెలిసింది.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



అమరనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోరంట్ల: మండల పరిధిలోని పులేరు హైస్కూల్‌లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యయుడిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు అమర్‌నాథ్‌రెడ్డిని సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్ఎం మాధవి, ఉపాధ్యయులు అశోక్, కృష్ణప్రసాద్, వెంకటేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్ సిక్స్’ అమలులో జాప్యమెందుకు?

- కూటమికి ఓటు వేసి ప్రజలు మోసపోయారు
- ఇచ్చిన హామీను వెంటనే అమలు చేయాలి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో ఎందుకు జాప్యం చేస్తుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ‘సాక్షి’తో మాట్లాడుతూ చంద్రబాబు అసెంబ్లీలో సూపర్ సిక్స్ పథకాల అమలంటేనే భయమేస్తుందని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఖజానాలో డబ్బులు లేవని తప్పించుకోవడానికి చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చేటప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఎగ్గొట్టడానికి ప్లాన్ వేశారన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలందరూ సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమయానికి తల్లికి వందనం, రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేదని ధ్వజ మెత్తారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ పథకాలను ఇప్పటికే అమలు చేసి ఉండేవారన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు చేసిన మోసాన్ని గ్రహించారని పేర్కొన్నారు. కూటమికి ఓటు వేసి తప్పు చేశామని పశ్చాతాప పడుతున్నారన్నారు. అధికారం చేపట్టి మూడు నెలల గడుస్తున్నా చంద్రబాబు సంపద సృష్టించకుండా ఏం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వెంటనే చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే పథకాల అమలు తనకు చేతకాదని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం ఉపాధ్యక్షురాలిగా శైలజ



శైలజకు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్: రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం ఉపాధ్యక్షురాలిగా కంపల్లె శైలజ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో రాయలసీమ నుంచి పోటీ చేసిన హిందూపురం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ ఉపాధ్యక్షురాలిగా విజయం సాధించారు. సోమవారం స్థానిక బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, జి. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా జడ్జిని అదనపు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీపీ ఇందాద్, న్యాయవాదులు సిద్ధూ, గోపాల కృష్ణా, నాగరాజురెడ్డి, సదాశివరెడ్డి, నాగేంద్ర, కృష్ణమూర్తి, కళావతి, సంతోషి కుమారి, పార్వతి, అంజిరమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



మహారుద్ర యాగం నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామంలో ఉన్న శివాలయంలో సోమవారం శివపార్వతుల గిరిజా కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, హోమాలు చేసి స్వామివారికి వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శివ పార్వతుల మూర్తులను ఊరేగించారు.

మడకశిరరూరల్: మండలం పరిధిలోని వివిధ దేవాలయాల్లో శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమిదాలగొందిలో కరిబసవేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. జిల్లెడుగుంటలో భక్తులు నరసింహస్వామికి జ్యోతులను సమర్పించారు.

మడకశిర: పట్టణంలోని చంద్రమౌళేశ్వర, మల్లికార్జున, వీరభద్ర, బసవేశ్వర, భోగి రామేశ్వర, రామలింగేశ్వర, శంకరలింగేశ్వర, దత్త బాణలింగేశ్వర, ఓంకారేశ్వర, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి పూజలు కూడా జరిగాయి.

పావగడ: స్థానిక సద్గురు భం భం బాబా అన్వరానందస్వామి భజన మందిరంలో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ధ్యానం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి పూజ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు.

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామ చెరువు కట్ట మీద వెలసిన కన్నేరమ్మ దేవికి సోమవారం గ్రామస్తులు అంతి సేవ నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి, బొమ్మలింగేశ్వర, మైలారలింగేశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలను మేళాతాళాలతో ఊరేగింపుగా చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

కోల్‌కత్తా ఘటనపై నిరసన గళం



పెనుకొండ: విద్యార్థినుల మానవహారం



మడకశిర: వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం చేస్తున్న విద్యార్థినులు

హిందూపురం టౌన్: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ మౌమితపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, అభిజ్ఞాన నృత్యాలయం గురువు చంద్రభాను చతుర్వేది ఆధ్వర్యంలో పట్టణంలో వేర్వేరుగా కొవ్వొత్తులతో సోమవారం నిరసన తెలిపారు. హత్య చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పనిచేసే చోట మహిళలకు భద్రత కల్పించాలని, మహిళా చట్టాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, రాము, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి: దేశంలోనే అతి పెద్ద నగరమైన కోల్‌కత్తాలో ఓ ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలంటూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే ఏఐడీఎస్ఓ, ఏఐఎంఎస్ఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొడిగెనహళ్లిలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

అగళి: ట్రైనీ డాక్టర్ మౌమిత హత్యకు నిరసనగా సోమవారం రాత్రి ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహిళలు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఓబులేస్, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రంలో సోమవారం రాత్రి ట్రైనీ వైద్యురాలు మౌమిత జరిగిన పాశవిక దాడికి నిరసనగా ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఘటనకు పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

మడకశిర: కోల్‌కతా ఘటనకు నిరసనగా సోమవారం పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు రోడ్డెక్కి నిరసనకు తెలియజేశారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ తాలూకా కార్యదర్శి పవిత్ర, సీపీఎం నాయకుడు రామాంజనేయులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్ పాల్గొన్నారు.



హిందూపురం: కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్

పెనుకొండ: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ మౌమితపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, కార్యదర్శి నాగార్జున, నాయకులు పునీత్, హరి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డీటీకి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న భాగ్యలక్ష్మికి సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు పూర్తి బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని భాగ్యలక్ష్మి తెలిపారు.

అమరాపురం తహసీల్దార్‌గా మారుతీప్రకాష్

అమరాపురం: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మారుతీ ప్రకాష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆరు నెలల నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డీటీగా విధులు నిర్వర్తిస్తున్న మారుతి ప్రకాష్‌ను ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల చదువుపై శ్రద్ధ తీసుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ శ్రీధర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని అలుపనపల్లి, హొట్టేబెట్ట, రొళ్ల కాంప్లెక్స్‌లో సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

రైతులకు న్యాయం చేయాలని నిరసన

పెనుకొండ: నాసిన్, బెల్ పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పలువురు రైతులు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. గతంలో ప్రభుత్వం నాసిన్, బెల్ పరిశ్రమల కోసం చినబాబయ్యపల్లి, తుంగోడు, పాలసముద్రం, కావేటినాగేపల్లి గ్రామాలకు చెందిన పలువురి రైతుల భూములు సేకరించారన్నారు. రైతులకు ఆర్ఆర్ ప్యాకేజీతో పాటు సంస్థల్లో ఉద్యోగావకాశాలను కల్పించి రైతు కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. రైతులకు న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

రొద్దం: మండల పరిధిలోని చెరుకూరులో యూ.హనుమంతప్పకు చెందిన పాడి ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందింది. వ్యవసాయ బోరుబావికి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మేతకు వెళ్లిన పాడి ఆవు షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆవు విలువ రూ 50 వేలు ఉంటుందన్నారు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

హిందూపురం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు షర్మిలా బేగం, సమంతారెడ్డి విద్యార్థులకు సూచించారు. పాంచ జన్య పాఠశాలలో సత్యనారాయణశెట్టి, తాయారమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బందికు వైద్యపరీక్షలు, మందులు పంపిణీ చేశారు.

జూదరుల అరెస్ట్

సోమందేపల్లి: మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రహరీని యథావిధిగా నిర్మించండి

పావగడ: పట్టణంలోని చారితాత్మక పురాతన కోట ప్రహరీని యథావిధిగా నిర్మించాలంటూ వాల్మీకి, దళిత నాయకులు కోట ప్రహరీ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఆందోళన శిబిరానికి చేరుకున్న తహసీల్దార్ వరదరాజు, మున్సిపల్ ముఖ్యఅధికారి జాఫర్ షరీఫ్ కూలిన కోట ప్రహరీని పరిశీలించారు. ప్రహరీని యథావిధిగా నిర్మిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



అమరాపురం: వైద్యుడికి రాఖీ కడుతున్న విద్యార్థినులు



పెనుకొండ: మంత్రి సవితకు స్వీట్ బాక్స్ అందిస్తున్న తొగటవీర క్షత్రియులు

మడకశిర: పట్టణంలో రక్షా బంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బ్రహ్మకుమారి ఈశ్వరి ఆలయం, సరస్వతీ విద్యామందిరంలో రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. అదే విధంగా సరస్వతీ విద్యామందిరంలోనూ రాఖీలు కట్టి అన్నా చెల్లెళ్ల పవిత్ర బంధాన్ని చాటి చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో రాఖీ ఉత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సరస్వతి విద్యామందిరం విద్యార్థులు గ్రామంలోని వీధుల్లో తిరిగి పలువురికి రాఖీ కట్టారు. మండలంలోని వివిధ పాఠశాలలో విద్యార్థినులు గురువులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

చిలమత్తూరు: రక్షా బంధన్ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారీలు మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు రాఖీ కట్టి స్వీట్లు పంచిపెట్టారు. పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులు ఎస్ఐ మునీర్ అహ్మద్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమందేపల్లికి చెందిన తొగట వీర క్షత్రియ సంఘం నాయకులు సీసీ హరితో పాటు పలువురు మంత్రి సవితను కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారికి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో పోలీసులకు రాఖీ కట్టి తమ సోదర భావాన్ని చాటుకున్నారు. హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే.పార్థసారథి సతీమణి కమలమ్మ తన తమ్ముడు శోభూషణ్ పటేల్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.